సంపుటి :02 సంచిక :235 పేజీలు :06

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

గురువారం 20, నవంబర్ 2025

# గవర్నర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు ఆమోదం ముదావహం
- ఈ- ఫార్ములా కేసు విచారణ పారదర్శకంగా సాగాలి
- కేంద్ర హోం సహాయశాఖ మంత్రి బండి సంజయ్

04




# వడి వడిగా మేడారం పనులు

దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క- సారలమ్మ మహాజాతర వచ్చే జనవరి 28న ప్రారంభమై 31 వరకు జరగనుంది. నాలుగు రోజుల పాటు అత్యంత వైభవముగా జరిగే ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి విచ్చేయను న్నారు. 1996లో నాటి ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించిన అనంతరం 2006 సంవత్సరం నుంచి పాలకులు ప్రతి రెండేళ్లకోసారి కోట్లాది రూపాయలను కేటాయిస్తూ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతున్నది. 2006 ముందు గద్దెల ప్రాంతంతో పాటు మేడారం గ్రామంలో రోడ్డుగా చిన్నగా ఉండేది. ప్రతీ మహా మేడారం జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో పాటు 2024 లో జరిగిన జాతర సందర్భంగా కోటి 50 లక్షలు మంది భక్తులు రావడం, ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం చేసిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి







వచ్చే జనవరిలో సమ్మక్క సారలమ్మ మహాజాతర

- పగిడద్దరాజు, గోవిందరాజు గద్దెల నిర్మాణం 90శాతం పూర్తి
- నాలుగు లైన్లుగా జాతీయ రహదారి పనుల విస్తరణ
- జాతరకు వచ్చే అన్ని రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- ఈనెల 12న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క పర్యటన
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని యంత్రాంగం, కాంట్రాక్టర్లకు ఆదేశం

02



# ప్రాసిక్యూషన్‌కు రైట్..రైట్

- ఈ-రేసింగ్ కేసులో కేటీఆర్ ను విచారించేందుకు గవర్నర్ అనుమతి
- త్వరలోనే ఛార్జీషీట్ దాఖలు చేయనున్న ఏసీబీ
- ఈ కేసులో ఏ1 నిందితుడిగా కేటీఆర్

05



## ఎమ్మెల్యేలు కడియం, దానంకు స్పీకర్ నోటీసులు

- తక్షణం అఫిడవిట్ దాఖలు చేయాలని ఉత్తర్వులు
- ఆ తర్వాత వారి అభ్యర్థిత్వంపై స్పీకర్ నిర్ణయం
- నాలుగు వారాల్లో రానున్న స్పష్టత

04

సవాల్ స్వీకరించి

02

# గన్ మెన్లు లేకుండా..

- హనుమకొండ బస్సు స్టేషన్ సందర్శించిన ఎమ్మెల్యే నాయిని
- చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే



# సవాల్ స్వీకరించి.. గన్ మెన్లు లేకుండా..

- హనుమకొండ బస్సు స్టేషన్ సందర్శించిన ఎమ్మెల్యే నాయిని
- చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే

అక్షరదర్బార్, హనుమకొండ: బీఆర్ఎస్ నేతలు విసిరిన సవాల్ ను స్వీకరించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం గన్ మెన్లు లేకుండా ఒంటరిగా హనుమకొండ బస్సు స్టేషన్ సందర్శించారు. బస్ స్టేషన్ ఆవరణలోని చిరు వ్యాపారులను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిలో హనుమకొండ వెనుకబడిందని, స్థానిక ఎమ్మెల్యే పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, దమ్ముంటే గన్ మెన్లు లేకుండా వెళ్లగలవా అని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల సవాల్ ను స్వీకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గన్ మెన్లు లేకుండా ఒంటరిగా హనుమకొండ బస్ స్టేషన్ సందర్శించారు. బస్ స్టేషన్ ఆవరణలోని చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరిస్తూ అభివృద్ధి అంశాలపై నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల పక్షాన నిలబడ్డానే కానీ హంగు ఆర్భాటాలకు ముందు వరసలో లేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో దిగజారుడు పనులతో రాజకీయాలను భ్రష్టు పట్టించిన రాజయ్య కూడా తన పనితనాన్ని విమర్శిస్తుండటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఊకదంపుడు ఉపన్యాసాలు అర్థం లేని మాటలు మాట్లాడటం సరికాదన్నారు.









పనులను పరిశీలిస్తున్న మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి



# వడివడిగా మేడారం పనులు

- వచ్చే జనవరిలో మహాజాతర
- పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల నిర్మాణం 90శాతం పూర్తి
- నాలుగు లైన్లుగా జాతీయ రహదారి పనుల విస్తరణ
- జాతరకు వచ్చే అన్ని రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- ఈనెల 12న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క పర్యటన
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని యంత్రాంగం, కాంట్రాక్టర్లకు ఆదేశం

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:
దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క–సారలమ్మ మహాజాతర వచ్చే జనవరి 28న ప్రారంభమై 31 వరకు జరగనుంది. నాలుగు రోజుల పాటు అత్యంత వైభవముగా జరిగే ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి విచ్చేయనున్నారు. 1996లో నాటి ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించిన అనంతరం 2006 సంవత్సరం నుంచి పాలకులు ప్రతి రెండేళ్లకోసారి కోట్లాది రూపాయలను కేటాయిస్తూ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతున్నది. 2006 ముందు గద్దెల ప్రాంతంతో పాటు మేడారం గ్రామంలో రోడ్డుగా చిన్నగా ఉండేది. ప్రతీ మహా మేడారం జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో పాటు 2024 లో జరిగిన జాతర సందర్భంగా కోటి 50 లక్షలు మంది భక్తులు రావడం, ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం చేసిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది.

## - రెండువారాల్లో గద్దెల ప్రాంగణం..

రెండు వారాల్లో గద్దెల ప్రాంగణం.. పునర్నిర్మాణ ముఖ్య పనులు పూర్తి చేస్తామని రోడ్లు, భవ నాల శాఖ తెలిపింది. రూ.27 కోట్లతో చేపట్టి మహాజాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మేడారంలో ప్రధాన రహదారులను నాలుగు వరుసలుగా విస్త రిస్తున్నారు. రూ. 27 కోట్లతో స్థానిక పెట్రోలు పంపు నుంచి గద్దెల ప్రాంగణం సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. తాడ్వాయి- మేడారం మార్గంలో నాలుగు చిన్నవాగులపై రూ.1.30 కోట్లతో కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. మేడారంతో పాటు రెడ్డిగూడెంలో సుమారు 4 కిలోమీటర్ల పొడవుతో రోడ్లకు ఇరువైపులా పంచాయతీరాజ్ శాఖ రూ.4 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టింది. ఈ నెలలో పనులు పూర్తవుతాయి. గ్రామీణ తాగునీటి సరఫరా, ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, నీటిపారుదలశాఖలు సైతం పనులు ప్రారంభించాయి. ఎన్పీడీసీఎల్ రూ.5 కోట్లతో పనులు పూర్తి కానున్నాయి. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖకు ప్రభుత్వం రూ.13 కోట్లు మంజూరు చేయగా రూ.50 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ మరమ్మతులు ప్రారంభమయ్యాయి. కోతలు పూర్తయితే మిగతా పనులు ప్రారంభమ వుతాయి. ఆర్టీసీకి రూ.4.35 కోట్లు మంజూరు కాగా రూ.1.50 కోట్ల విలువైన క్యూలైన్, బస్టాండ్ చదును పనులు ముమ్మ రంగా కొన సాగుతున్నాయి.

## - రూ.251కోట్లతో పనులు

రాష్ట్రప్రభుత్వం మేడారంలో రూ.251 కోట్లతో ప్రగతి పనులు చేపడుతున్నది. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, ఎన్పీడీసీఎల్, నీటిపారుదల, ఆర్టీసీ, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నాయి. దీనిలో భాగంగా పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెల పునర్నిర్మాణం 90 శాతం పూర్తయింది. ప్రాంగణం విస్తరణలో భాగంగా మూడు వైపులా పునాది నిర్మాణం చివరి దశకు చేరుకుంది. యంత్రాలు, కూలీలు నిరంతరం పని చేస్తున్నారు. సాలాహారం నిర్మాణానికి వినియోగించే రాళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి దిగుమతి అయ్యాయి.

## - నాలుగు లైన్లుగా అభివృద్ధి

వరంగల్– హనుమకొండ, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల మీదుగా వెళ్లాల్సిన వాహనాలు 163వ నంబరు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాల్సిందే. వరంగల్– ఏటూరునాగారం రోడ్డుగా పిలిచే ఈ మార్గంలో డిసెంబరులోనే ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రహదారుల విస్తరణపై నజర్ వేసింది. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా 29.60 కి.మీ మేర విస్తరించాలని నిర్ణయించింది. మధ్యలో 3 మీటర్ల డివైడర్, ఇరువైపులా చివర్లలో ఒక్కో మీటరు అదనపు విస్తరణ కలుపుకొని 23 మీటర్ల వెడల్పుతో పనులు జరుగుతున్నాయి. రూ.208.72 కోట్లతో చేపట్టే ఈ పనులు 2021లో మంజూరు కాగా 2022లో ప్రారంభమయ్యాయి. అనుమతులు, నిర్మాణ ప్రతిపాదనల్లో మార్పులతో కొంత ఆలస్యమైంది. వర్షాలతో పనులకు ఆటంకం కలుగుతోంది.

## - ఇతర రహదారుల పనులు..

కటాక్షపురం, మల్లంపల్లి, నీరుకుళ్ల గ్రామాల వద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఇందులో నీరుకుళ్ల వద్ద భూసేకరణ జరగాల్సి ఉండటంతో పనులు ప్రారంభం కాలేదు. కటాక్షపురం చెరువు వద్ద పనులు ప్రారంభించి పిల్లర్ల దశలో నిర్మాణం ఉండగా వర్షాలతో చెరువు అలుగు పోస్తుండటం వల్ల ఆటంకం ఏర్పడింది. మల్లంపల్లి వద్ద వంతెనను రెండువైపులా ఒకేసారి చేపట్టేందుకు అనుమతి లేకపోవటంతో ఒకవైపు నిర్మాణం ప్రారంభించారు. ఈ పనులను డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. జాతర నాటికి ఒకవైపు వంతెనను అందుబాటులోకి తెస్తామని, రెండోవైపు తాత్కాలిక రోడ్డు వేసి వాహనాలను అనుమతించే అవకాశం ఉందంటున్నారు. కటాక్షపురం వద్ద వంతెన మాత్రం జాతర నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించటం లేదు. గుంతలమయంగా మారిన లోలెవల్ వంతెనను సిమెంటుతో మరమ్మతులు చేసి, తారు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసే ఆలోచనతో ఉన్నట్లు ఓ అధికారి తెలిపారు.

## - ముగ్గురు మంత్రుల పరిశీలన

మేడారంలో ఈ నెల 12న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క పర్యటించారు. సమ్మక్క–సారలమ్మ గద్దెలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మేడారం ఆలయ అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని యంత్రాంగాన్ని , కాంట్రాక్టర్లను ఆదేశించారు.

# సాహసనారి ఝాన్సీ లక్ష్మీబాయి

## –యువతకు ఆదర్శం కావాలి : ఎస్ఐ హేమ



అక్షర దర్బార్, చిట్యాల : సాహసవంతురాలిగా చరిత్రలో నిలిచిన ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకొని యువతులు, మహిళలు ధైర్యం మరియు సంకల్పంతో జీవితంలో ముందుకు సాగాలని చిట్యాల రెండవ ఎస్సై హేమ సూచించారు. గురువారం ABVP చిట్యాల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి పురస్కరించుకొని సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై హేమ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, పాఠశాల దశ నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని సూచించారు. తరువాత వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజు కుమార్, నగర కార్యదర్శి అజయ్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రవీందర్, నాయకులు సాయి, శశి వర్ధన్ పాల్గొన్నారు.

# సీనియర్లకు అవకాశం కల్పించాలి



అక్షర దర్బార్ వెంకటాపూర్ : ఉపాధి హామీ పథకంలో సీనియర్లను మెట్ గా నియమించాలని ఇంచెం చెర్వుపల్లి గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులందరూ గ్రామంలో గ్రామసభ నిర్వహించి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఈ సందర్భంగా అందజేశారు. ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటుగా గతంలో పనిచేసిన ఆరు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పించి ఇతరులకు అవకాశం ఇవ్వకూడదని గ్రామస్తులందరూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# ఎమ్మార్పీఎస్ నేతకు నివాళి..

అక్షర దర్బార్, శాయంపేట : మండలంలోని గట్లకనపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు బొమ్మ కంటి సాంబయ్య మరణించగా ఆయన పార్థివ దేహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పులమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధ సాధన కోసం సుదీర్ఘంగా దండోరా ఉద్యమంలో తన వంతు క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుం వెంకటేష్, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు భాస్కర్,బొమ్మకంటి రవీందర్, నాయకులు బొమ్మకంటి పోశాలు, మాజీ సర్పంచ్ బొమ్మ కంటి సాంబయ్య, చింతం రాజేందర్, డబ్బా రవి, టైలర్ కుమార్, మహేంద్ర, మచ్చి కుమార్, స్టీరింగ్ కుమార్,కోయిల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# నాగుర్ల పరామర్శ..



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్, కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ రమేష్ తండ్రి మల్లయ్య మృతి చెందగా గురువారం రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వారి ఇంటికి వెళ్లి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘం చైర్మన్ తాళ్ళ శామ్ రాజ్, గ్రామ ముదిరాజ్ సంఘం డైరెక్టర్ తాళ్ళరవి, మండల ఆరె సంఘం అధ్యక్షులు లోకటి నగేష్, తాళ్ళ పున్నం చందర్, కుమార్, సారంగపాణి, రవి, నవీన్, మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో

# అడిషనల్ కలెక్టర్ తనిఖీ



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన ధాన్యాన్నే కొనుగోలు చేయాలని, రైతులు తెచ్చే వరి తేమశాతం ప్రతిరోజూ పరీక్షించాలని పీపీసీ సిబ్బందికి ఆదేశించారు. 17% తేమశాతం ఉన్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి వెంటనే కొనుగోలు చేయాలని హెచ్చరిస్తూ, ప్రతి కేంద్రంలో నోటీస్‌బోర్డు ఏర్పాటు చేసి రోజువారీ వివరాలు ప్రదర్శించాలని సూచించారు. సీరియల్ నంబర్ల ప్రకారం కొనుగోలు జరగాలని, ధాన్యాన్ని వెంటనే ట్యాగ్ చేసిన రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. తదుపరి పొలాల్లో హార్వెస్టింగ్ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్గదర్శకాలను హార్వెస్టర్ యజమానులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అధికారులు ప్రతిరోజూ పీపీసీలను పరిశీలించి లోపాలు గమనించిన వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి శశికిరణ్ కుమార్, డీఎం రాములు, తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు
- రసవత్తరంగా పోలీసు వర్సెస్ ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



అక్షర దర్బార్, వెంకటాపూర్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడటంతో పాటు పరస్పర స్నేహభావాన్ని పెంచుతాయని వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు అన్నారు. ములుగు ఎస్పీ డాక్టర్ శబరిష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామ శివారులో పోలీస్ వర్సెస్ ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. జర్నలిస్టులను రెండు జట్లుగా, పోలీసు సిబ్బందిని మరో జట్టుగా విభజించి మ్యాచ్‌ను రసవత్తరంగా నిర్వహించారు. ప్రత్యేకమైన ప్రాక్టీస్ లేకపోయినా జర్నలిస్టులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారని ఎస్ఐ చల్ల రాజు ప్రశంసించారు. మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన జర్నలిస్టులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్–ప్రెస్ స్నేహభావాన్ని మరింత బలోపేతం చేయడానికి ములుగు జిల్లా కేంద్రంలో త్వరలో భారీ స్థాయిలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ చల్ల రాజు వెల్లడించారు. ఈ మ్యాచ్‌కు సహకరించిన నల్లగుంట, లక్ష్మీదేవిపేట గ్రామాల యువకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రామిడి కృష్ణారెడ్డి, భేతి సతీష్, రంగిశెట్టి రాజేందర్, ఒద్దుల మురళి, యుగంధర్, శివ, బిక్షపతి, విజయ్, రవిరాజా, యోగి, ధర్మతేజ, కర్ణాకర్, బీమలాల్ నాయక్, సంపత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# తై బజార్ కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లు..

- అనారోగ్య జంతువుల మాంసం విక్రయం
- కమిషనర్ కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

అక్షర దర్బార్, పరకాల: పరకాల తై బజార్ కాంట్రాక్టర్ వ్యాపారులపై నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తూ బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు గాజులు నిరంజన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సుష్మ కు వినతిపత్రం ఇచ్చారు. ప్రతి వ్యాపారిపై రూ.50, బయట నుంచి వచ్చే వాహనాలపై రూ.100 వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై తక్షణ చర్యలు తీసుకుని కాంట్రాక్ట్ రద్దు చేయాలని, తిరిగి టెండర్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో మటన్, చికెన్ షాపులు అనారోగ్యానికి గురైన జంతువుల మాంసాన్ని విక్రయిస్తున్నాయని, మున్సిపల్ పర్యవేక్షణ లేకపోవడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, సంఘ పురుషోత్తం, మార్త రాజభద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, నాయకులు కుక్కల విజయ్ కుమార్, మిడిదొడ్డి నరేష్, దార్న సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న కేంద్రం

## ఎస్ కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్




అక్షర దర్బార్, వరంగల్ : వరంగల్ ఓంకార్ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేయం) ఆధ్వర్యంలో జరిగిన రైతు సంఘాల సంయుక్త సమావేశంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ అన్నారు. పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతులకు రుణమాఫీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లు 2025 ఉపసంహరణ, పత్తి రైతులకు సిసిఐ ఆంక్షలను తొలగించడం, వర్షాల–తుఫాన్ల నష్టాలకు సరైన పరిహారం అందించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడానికి నవంబర్ 26న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

# అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు



అక్షర దర్బార్, నల్లబెల్లి : గ్రామీణ శిశు ఆరోగ్య అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలే పునాది అని తహసీల్దార్ ముప్పు కృష్ణ, నర్సంపేట సీడీపీఓ మధురిమ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర ఆధ్వర్యంలో గురువారం నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ శిశు ఆరోగ్యం, పోషణ, టీకా కార్యక్రమాల నిర్వహణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, గర్భిణీ స్త్రీల సంరక్షణ, రక్షణాత్మక టీకాలపైన అంగన్వాడీ సిబ్బంది చేయాల్సిన పని అత్యంత బాధ్యతాయుతమైందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి విజయ్ కుమార్, ఎంపీడీవో శుభనివాస్, ఎస్సైలు గోవర్ధన్, వెంకట రెడ్డి, ఎంఈఓ అనురాధ, ఏవో రజిత, వైద్యాధికారులు ఆచార్య, జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## వీసీకే విద్యార్థి విభాగం
# కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వీసీకే విద్యార్థి విభాగం కమిటీని గురువారం ఎన్ను కున్నారు. వరంగల్–హనుమకొండ ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ శనిగరపు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావే శంలో కనకం హితేష్ అధ్యక్షుడిగా, కుర్రి వివేక్ తేజ ఉపాధ్య క్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తోట అభినయ్ ప్రధాన కార్యదర్శిగా, విద్యార్థి విభాగ నాయకులుగా జనగాం కృష్ణ తేజ, దేవుళ్ళ శివను నియమించారు. వీసీకే యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికైన హితేష్, వివేక్ తేజను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు వినయ్ తేజ, అనిల్, సాయి ప్రకాష్, లవన్ తదితరులు పాల్గొన్నారు.

## దుగ్గొండి ఏవోగా శ్యామ్ బాధ్యతల స్వీకరణ



అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండల వ్యవసాయ అధికారిగా గాజుల శ్యామ్ గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇంతకుముందు ఈ హోదాలో పనిచేసిన బానోతు మాధవి డిప్యూటేషన్‌పై వరంగల్ భూసార పరీక్ష కేంద్రానికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో శ్యామ్ కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారులు నూతన ఏవోగా బాధ్యతలు స్వీకరించిన గాజుల శ్యామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## చిన్ననాటి స్నేహితునికి
# ఆర్థిక చేయుత

– రూ.5 వేలు, 50 కేజీల బియ్యం వితరణ

అక్షరదర్బార్, గణపురం: గణపురం మండల కేంద్రానికి చెందిన చేను మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మొగిలి చిన్ననాటి స్నేహితులు 1989–90 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆర్థిక చేయూతనందించారు. మొగిలి కుమార్తె సరితకు రూ.5 వేలతోపాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. మొగిలి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాళ్ల రంగయ్య, నాగపురి శ్రీనివాస్ గౌడ్, దుర్గం రవీందర్ గౌడ్, ఎం అన్నపూర్ణ, ఝాన్సీ, తిరుపతిరెడ్డి, రాందేవ్, కట్టంగూరి రాజగోపాల్ రెడ్డి, బొడిగ సదయ్య గౌడ్, ఒల్లాల రాంబాబు గౌడ్, ల్యాదల్ల శంకర్ గౌడ్ తదిత రులు పాల్గొన్నారు.

# అన్నదానం

అక్షరదర్బార్, హనుమకొండ: శ్రమ, పట్టుదలతోనే సామాజిక కార్యక్రమాల నిర్వహణ సాధ్యపడుతుందని ప్రముఖ వైద్యులు వేముల ప్రసాదరావు అన్నారు. సేవ చేయడం అందరికి సాధ్యం కాదని, కృషి, శ్రమ, పట్టుదల ఉంటేనే ఇలాంటి కార్యక్రమాలు విజయ వంతం అవుతాయని అన్నారు. శ్రీ భద్రకాళి వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని గురువారం బాలసముద్రంలో ప్రముఖ వైద్యులు ప్రసాదరావు ప్రారంభించారు. సుమారు 600 మందికి భోజనాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద రావు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి నెల అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ చేస్తున్న సేవా సమితి కృషి అభినందనీయమన్నారు. దివంగత పాత్రి కేయులు వీవిఎల్ నరసింహారావు స్మృత్యర్థం ఆయన కుటుంబ సభ్యులు స్వీట్స్ వితరణ చేశారు. కార్యక్ర మంలో నిర్వాహకులు పిన్నా శివకుమార్, క్రిటికల్ కేర్ వైద్యులు చిలుకమూరి గోపినాథ్, మహేష్ స్వామి, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, నల్లా దిలీప్ కుమార్ , సత్యనారాయణరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, చోల్లేటి శ్రీధర్, చంద్రశేఖర్, గౌరిశెట్టి ధనుంజయ, రాధాకృష్ణ, పాములపర్తి కేశవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## ఎమ్మెల్యేలు కడియం, దానంకు
# స్పీకర్ నోటీసులు



- తక్షణం అఫిడవిట్ దాఖలు చేయాలని ఉత్తర్వులు
- ఆ తర్వాత వారి అభ్యర్థిత్వంపై స్పీకర్ నిర్ణయం
- నాలుగు వారాల్లో రానున్న స్పష్టత

అక్షరదర్బార్, హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిష న్లపై వివరణ కోరుతూ గురువారం స్టేషన్ ఘన్‌పూర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ మరోసారి నోటీసులు ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారని ఆరో పణలు ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా, వీరిలో ఎనిమిది మందిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఎనిమిది మంది కూడా స్పీకర్ నోటీసులకు జవాబు ఇచ్చారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరింత గడువు కావాలని స్పీకర్‌ను కోరారు. గురువా రంతో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుంది. దీంతో స్పీకర్ మిగతా ఇద్దరికి మరోసారి నోటీసులిచ్చారు. తన నోటీ సులకు తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయసలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత స్పీకర్ తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. నాలుగు వారాల్లోగా ఈ కేసులో నిర్ణయం ప్రకటించాల్సి ఉన్నందున సభాపతి విచారణను వేగవంతం చేశారు.




# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాలు వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో 'సే నో టూ డ్రగ్స్' నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ సీపీ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యమని అన్నారు. మత్తు పదార్థాల నియంత్ర ణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందని, ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమాచారం అందించి డ్రగ్స్ రహిత సమాజానికి మీరు భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబ డుతాయని సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్ఐ శివకేశవులు, ఇన్ స్పెక్టర్ సతీష్, ఆర్ఎస్ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు, సందీప్ పాల్గొన్నారు.



## గవర్నర్ నిర్ణయాన్ని
# స్వాగతిస్తున్నాం

- కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు ఆమోదం ముదావహం
- ఈ- ఫార్ములా కేసు విచారణ పారదర్శకంగా సాగాలి
- కేంద్ర హోం సహాయశాఖ మంత్రి బండి సంజయ్

అక్షరదర్బార్, హైదరాబాద్: ఫార్ములా ఈ రేసు కేసులో మాజీమంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతివ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని కేంద్ర హోం సహ యశాఖ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ నేతలతో కలిసి గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వొద్దనే సీఎం రేవంత్ రెడ్డి కోరుకున్నారని అభిప్రా యపడ్డారు. రాష్ట్రంలో ఆర్కే (రేవంత్ రెడ్డి, కేటీఆర్) పాలన కొన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిం దని ఆ పార్టీకి మద్దతిస్తూ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములు య్యారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎగ్గొట్టారు? భూమలిచ్చారా? ఉద్యోగాలిచ్చారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? మహిళలకు నెలనెలా రూ.2500లు ఇచ్చారా? వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? మరి కాంగ్రెస్ ప్రభుత్వంలో మీకు నచ్చింది ఏమిటి? ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు తీసుకుని భాగ స్వాములు అవుతున్నారో చెప్పాలని నిలదీశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులున్నారు.

# ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అక్షరదర్బార్, గీసుకొండ: రైతులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం గీసుకొండ మండలం ఊకల్ ఎఫ్ ఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు వేడుకల్లోనూ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మనకు మనం అభివృద్ధి చేసుకునే వ్యవస్థ సహకార వ్యవస్థ అని, వ్యవసాయ రంగానికి సహకార వ్యవస్థ చాలా అవసరం అన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందించడం, రైతులకు సాగు విధానం, ఆధునిక వ్యవసాయం, తదితర అంశాలకు సహకార సంఘాలు తోడ్పడతాయన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ సహకార సంఘాలు బలోపేతం చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వం లక్ష్యం అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సహకార వ్యవస్థ ద్వారానే అభివృద్ధి సాధ్యం అని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో 26 మహిళా డైరీ సొసైటీలను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, తహసిల్దార్ రియజోద్దీన్, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాసిక్యూషన్ కు రైట్..రైట్..!

- ఈ- రేసింగ్ కేసులో కేటీఆర్ ను విచారించేందుకు గవర్నర్ అనుమతి
- త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేయనున్న ఏసీబీ
- ఈ కేసులో ఏ1 నిందితుడిగా కేటీఆర్



అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో ఈ ఫార్ములా రేసు పేరిట రూ.58 కోట్ల నిధుల దుర్వినియోగానికి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. కేసు విచారణను ఏసీబీకి అప్పగించింది. ఈ క్రమంలో గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ రేసింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఈ– కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్ చేసేందుకు గవర్నర్ అనుమతిలిచ్చారు. అయితే ఫార్ములా ఈ రేసింగ్ కేసులో కేటీఆర్ ఇప్పటికే నాలుగు సార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో ఏసీబీ ఈ విచారణ జరుపుతోంది. ఈ కేసులో కేటీఆర్ పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ గవర్నర్‌ను ఏసీబీ అనుమతి కోరింది. ఈ మేరకు గతంలోనే ఏసీబీ లేఖ రాసింది. దానిని పరిశీలించిన గవర్నర్ తాజాగా కేటీఆర్ విచారణకు అనుమతి జారీ చేశారు. దీంతో ఈ రేసింగ్ కేసులో ఏసీబీ త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది.

### - సమగ్ర విచారణ

ఈ రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీ గత ఏడాది డిసెంబర్‌లో విచారణ ప్రారంభించింది. రేసింగ్‌లో అవకతవకలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఏ1గా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి పేర్లను చేర్చింది. ఈ క్రమంలో ఇప్పటికే కేటీఆర్‌ను ఏసీబీ విచారించింది. ఈ కేసులో మొదట్లో కీలకంగా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ ప్రతినిధులను ఏసీబీ గత జనవరిలో విచారించింది. ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ డైరెక్టర్ అనిల్‌ను దర్యాప్తు అధికారులు సుమారు రెండున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ కేసులో ఏస్ నెక్స్ ట్రెజెన్ సంస్థనే రేసు నిర్వహించాల్సి ఉండగా కార్ రేస్‌కు సంబంధించి అనుమతులు పొందేందుకు సమర్పించిన పత్రాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వివరాలు గురించి ఏసీబీ అధికారులు ఆరా తీశారు.



# మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

- ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతల్లో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈఈఈపీసీ సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జడ్పీ సీఈవో రవి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేయాలి

### - మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్

అక్షరదర్బార్, ములుగు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని మహబూబాబాద్ ఎంపీ అండ్ దిశా కమిటీ ఛైర్మన్ పోరిక బలరాంనాయక్ అన్నారు. గురువారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశా కమిటీ సమావేశం పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టుఎస్, దిశ కమిటి మెంబర్ పూర్ణచందర్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జీ (రెవెన్యూ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. నేషనల్ హైవే 163 జంగాలపల్లి నుండి పస్రా ఫోర్ లైన్ పనులు ప్రారంభించాలని, జలగలంచ, కృష్ణాపురం, టేకులగూడెం బ్రిడ్జిల నిర్మాణం ప్రపోజల్స్ సమర్పించాలన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, డీఆర్ డీఓ శ్రీనివాస్ రావు, డీఎస్పీ రవీందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పై కావాలనే వేధింపులు

- స్థానిక ఎన్నికల వేళ సీఎం చిల్లర డ్రామాలు
- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కుట్ర రాజకీయాలు
- సీఎం రేవంత్ రెడ్డి పైశాచికానందం
- మాజీ మంత్రి హరీశ్ రావు



అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి సీఎం రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొంటూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలు, కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గమని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ రేసులో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నదని ఎద్దేవా చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915